క్లుప్తంగా

సెలవుల్లోనే క్లాసులు ప్రారంభం!


కళాశాలకు వస్తున్న కొంత మంది విద్యార్థినులు

నగరి: ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విధానం మేరకు సెలవుల కాలం శిక్షణా కాలంగా మారింది. మంగళవారం ఇంటర్మీడియెట్ సెకండియర్ విద్యార్థులు మళ్లీ యూనిఫామ్ ధరించి కళాశాలకు హాజరయ్యారు. మండుతున్న ఎండలు, ఉక్కపోతల నడుమ తరగతి గదిలో కూర్చున్నారు. స్థానిక పీసీఎన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సుమారు 500 మందికి గాను వంద మంది మాత్రమే హాజరయ్యారు. ప్రైవేటు కళాశాల లు ఈ విధానానికి స్వస్తి పలికాయి. ఏ ప్రైవేటు కళాశాలలోనూ తరగతులు నిర్వహించలేదు.

ఇన్‌చార్జి ఎంపీడీఓగా పురుషోత్తం



వెదురుకుప్పం: ఇన్‌చార్జి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఈఓపీఆర్డీ పురుషోత్తం మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన అమర్నాథ్ శ్రీకాళహస్తికి బదిలీ కావడంతో ఆయన స్థానంలో ఈఓపీఆర్డీకి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో కూడా ఆయన కొంతకాలం ఇన్‌చార్జి ఎంపీడీఓగా పనిచేశారు.

వైఎస్సార్‌సీపీ నేతకు నివాళి


నివాళులర్పిస్తున్న కుమారస్వామి రెడ్డి

నగరి: మండలంలోని కృష్ణరామాపురంలో వైఎస్సార్‌సీపీ నేత పుష్పారెడ్డి అనారోగ్యంతో మృతిచెందారు. మంగళవారం మృతుని స్వగృహానికి వెళ్లి వైఎస్సార్ సీపీ నేత కుమారస్వామి రెడ్డి పుష్పారెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మృతుని కుటుంబ సభ్యులు, నాయకులు ఏలుమలై రెడ్డిని పరామర్శించారు.

పెన్షన్లు పంపిణీ


పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

కార్వేటినగరం: మండలంలోని సురేంద్రనగరం పంచాయతీ ఆది ఆంధ్రవాడలో మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ చేశారు. గ్రామంలో సీసీ రోడ్డు వేయాలని, కమ్యూనిటీ భవనం నిర్మించాలని స్థానికులు కోరారు. సమస్యలను అధికారులు పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన వసూళ్ల ఘట్టం

- వసూళ్లు నిరాశాజనకం
- గత ఆర్థిక సంవత్సర పన్ను వసూళ్లు రూ.2.86 కోట్లు
- బకాయిలు రూ.2.46 కోట్లు
- ఆర్థిక సంవత్సరంలో పన్ను చెల్లించని వారికి పెనాల్టీ మోత

నగరి: గత ఆర్థిక సంవత్సరానికి సంబంధిత పన్ను వసూళ్ల కోసం నెల పాటు సెలవులు లేకుండా మున్సిపల్, సచివాలయ సిబ్బంది ఇంటింటా తిరుగుతూ చేసిన పన్ను వసూళ్ల ఘట్టం ముగిసింది. 17 సచివాలయాల పరిధిలోని 14,075 అసెస్మెంట్లకుగాను గత ఆర్థిక సంవత్సరంలో రావలసిన డిమాండ్లు, బకాయిలు మొత్తం రూ.5.32 కోట్లు వసూలు కావలసి ఉండగా అందులో 53.76 శాతం 2.86 కోట్లు మాత్రమే వసూలైంది. రూ.2.46 కోట్లు వసూలు కాలేదు. సిబ్బంది ఎంతగా శ్రమించినా దాదాపు 50 శాతం మాత్రమే వసూలు చేయగలిగారు. డిమాండును అనుసరించి అధిక వసూళ్లు చేయడంలో కశింమిట్ట సచివాలయం ప్రథమ స్థానంలో నిలువగా అతి తక్కువ వసూళ్లతో సత్తం కండ్రిగ సచివాలయం చివరిస్థానంలో నిలిచింది.

పెనాల్టీల మోత

గడువు ముగిసినా పన్ను చెల్లించక బకాయి ఉన్నవారికి పెనాల్టీల మోత మోగింది. కొన్నేళ్ల పాటు బకాయి ఉండి వడ్డీలో 50 శాతం మినహాయింపు ఇచ్చినా వసూలు కాని మొండి బకాయిలు రూ.94.80 లక్షలు ఉంటోంది. దీనిపై రూ.77.13 లక్షలు పెనాల్టీ విధించారు. గత ఏడాది విధించిన పన్ను మాత్రమే వసూలు కావలసినది రూ.66.60 లక్షలు ఉండగా దానిపై రూ.7.44 లక్షల పెనాల్టీ పడింది. వెరసి మున్సిపల్ ఖాతాలో ఇంకా వసూలు కావలసిన పన్ను బకాయిలు రూ. 2.46 కోట్లకు చేరింది.



మున్సిపల్ కార్యాలయం

పన్నుల ఎసూళ్ల కన్నా జీతాలే ఎక్కువ

ఆస్తి పన్ను రూపేణా మున్సిపాలిటీకి వచ్చే ఆదాయం కన్నా టైమ్ స్కేల్, ఒప్పంద కార్మికులకు ఇచ్చే జీతాల సొమ్మే ఎక్కువగా ఉంది. జీతాలకు రూ. 5.04 కోట్లు చెల్లించాల్సి ఉంది. వసూళ్ల కంటే ఖర్చులు ఎక్కువగా ఉండడంతో మున్సిపల్ పరిధిలోని 29 వార్డులకు అవసరమైన శానిటేషన్ సిబ్బందిని కూడా నియమించుకోలేని దుస్థితి కలుగుతోంది. మొత్తం పన్ను వసూలై ఉంటే మున్సిపల్ పరిపాలనా ఖర్చులకు ఎలాంటి ఆటంకాలు ఉండేది కాదు.

బకాయిల వసూళ్లకు చర్యలు తీసుకుంటాం

“ మొండి బకాయిదారులకు ఇప్పటికే పలుమార్లు నోటీసులు ఇచ్చాం. పన్ను చెల్లించకుండా జాప్యం చేస్తూ వస్తే చెల్లించాల్సిన బకాయిలు పెరుగుతూనే ఉంటుందని వారు అర్థం చేసుకోవాలి. బకాయి ఉన్న పన్ను చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలి.

\- కృష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనర్, నగరి మున్సిపాలిటీ



నోటీస్ బోర్డు

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

- కార్వేటినగరం: మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలోని వెలుగు సమావేశ భవనంలో బుధవారం ఉదయం 10 గంటలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ చంద్రమౌళి తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమెల్యే డాక్టర్ వీఎం థామస్ హాజరవుతారని, సమస్యలను నివేదించి పరిష్కరించుకోవాలని కోరారు.

నేటి నుంచి పాలిసెట్ ఉచిత శిక్షణ తరగతులు

పుత్తూరు: పాలిటెక్నిక్ ప్రవేశాల కోసం ఈనెల 30న రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణ మండలి పాలిసెట్-2025 పరీక్ష నిర్వహిస్తున్న నేపథ్యంలో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పుత్తూరు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్వీకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.10వ తరగతి ఉత్తీర్ణులైన, ప్రస్తుతం పరీక్షలు రాసిన విద్యార్థులకు సైతం కళాశాలలో ఏప్రిల్ 2 నుంచి 28వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 9–30 నుంచి మధ్యాహ్నం 12–30 గంటల వరకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తామని, వీటికి హాజరయ్యే విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్‌ను తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమాల్లో ఇవ్వనున్నట్లు తెలియజేశారు. పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 15వ తేదీ గడువు ముగుస్తుందని, వివరాలకు 90102 22155, 83282 64905 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

సమయపాలన పాటించడం ముఖ్యం

–డీసీహెచ్‌ఎస్ ప్రభావతి

కార్వేటినగరం: విధి నిర్వహణలో సమయపాలన తప్పనిసరి పాటించాలని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ప్రభావతి అన్నారు. మంగళవారం మండలంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. వేసవి దృష్ట్యా వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. రోగులు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లకుండా సీహెచ్‌సీలోనే మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తేవాలన్నారు. అలాగే ఓపీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యులు భాగ్యలక్ష్మి, గోపీనాథ్, శృతిభాగ్యం, లక్ష్మీపతి, దివ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ప్రభావతి

ప్రశాంతంగా ముగిసిన పదో తరగతి పరీక్షలు


పరీక్ష కేంద్రం నుంచి వెలుపలికి వస్తున్న విద్యార్థులు

పాలసముద్రం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ముగిశాయని ఎంఈఓ రాజేంద్రప్రసాద్, చీఫ్ సూపరింటెండెంట్ రాజేంద్రనాయుడు తెలిపారు. మొత్తం 164 మంది విద్యార్థులకు హాజరయ్యారని, ఎలాంటి మాస్ కాపీయింగ్‌కు అవకాశం ఇవ్వకుండా పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు.

అటకెక్కిన ఆహార సలహా కమిటీలు

- రేషన్ దుకాణాలపై కొరవడిన పర్యవేక్షణ
- సరుకుల పంపిణీలో అవకతవకలు

గుడిపాల: రేషన్ దుకాణాల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసి, నిరుపేదలకు నిత్యావసరాలు అందే విధంగా పర్యవేక్షించే ఆహార సలహా సంఘ సభ్యులు నేడు కనిపించడం లేదు. ప్రస్తుతం ఈ సంఘాల ఉనికి లేకపోవడంతో పర్యవేక్షణ అధికారులు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో తూకాల్లో మోసాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. లబ్ధిదారులకు నిత్యావసర వస్తువులు సక్రమంగా అందడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఆహార సలహా కమిటీ ప్రతి మూడు నెలలకోసారి సమావేశం నిర్వహిస్తుంది. మండల స్థాయిలో ఉన్న రేషన్ దుకాణాల నిర్వహణపై సమీక్షిస్తుంది. ప్రస్తుతం అటువంటి పరిస్థితి కనిపించడం లేదు. చిత్తూరు నియోజకవర్గంలో చిత్తూరు అర్బన్‌తోపాటు చిత్తూరు రూరల్, గుడిపాల మండలాలు ఉన్నాయి. ఇందులో 173 రేషన్ దుకాణాలు ఉన్నాయి. అదే విధంగా 63,231 రేషన్‌కార్డులు ఉన్నాయి. ఆహార సలహా కమిటీ చైర్మన్‌గా మండల స్థాయిలో తహసీల్దార్, జిల్లా స్థాయిలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ వ్యవహరించేవారు. సభ్యులుగా ఎంపీడీవో, జెడ్పీటీసీ సభ్యులు, పాత్రికేయులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులను నామినేట్ చేసేవారు. ప్రతి మూడు నెలలకోసారి సమావేశం ఏర్పాటుచేసి సక్రమంగా నిత్యావసర వస్తువులు అందుతున్నాయా లేదా అని సమీక్షించేవారు. కానీ ప్రస్తుతం మాత్రం అందుకు భిన్నంగా ఉందనే చెప్పవచ్చు.



గుడిపాల తహసీల్దార్ కార్యాలయం

ఇష్టారాజ్యంగా...

ఆహార సలహా సంఘాలు లేకపోవడంతో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నాణ్యతను పట్టించుకోవడం లేదు. దుకాణాల తూకాల్లో మోసం జరుగుతోంది. ఈ మోసాల నివారణకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో లబ్ధిదారులకు ఎండీయూ ఆపరేటర్ల ద్వారా వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి రేషన్ అందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ వ్యవస్థ పూర్తిగా గాడి తప్పిందని లబ్ధిదారుల్లో చర్చ మొదలైంది.

చిత్తూరులో రేషన్ దుకాణాలు

మండలం	దుకాణాలసంఖ్య	కార్డుదారులు
గుడిపాల	48	12,500
చిత్తూరు అర్బన్	125	50,731

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు స్థలం చూపరూ!

- ఇళ్ల పట్టాలు కూడా ఇవ్వాలని వినతి

నగరి: డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు స్థలం చూపాలని కోరుతూ నగరి మున్సిపాలిటీ 9వ వార్డు నెత్తం కండ్రిగ వాసులు ఇన్‌చార్జి తహసీల్దార్ ధనంజయులుకు వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ, సత్తం కండ్రిగ దళితవాడలో గత 35 ఏళ్లుగా నివాసం ఉంటున్న వారికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ఇన్‌చార్జి తహసీల్దార్ మాట్లాడుతూ, సర్వే చేసి విగ్రహం ఏర్పాటుకు స్థలం చూపుతామని, అలాగే అర్హులకు పట్టాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య, గ్రామ కమిటీ నాయకులు శివకుమార్, వార్డు కమిటీ నాయకులు సురేష్ రాజు, వేలు, యేసయ్య మహేంద్ర, ముత్తు, బాబు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.


ఇన్‌చార్జి తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నెత్తంకండ్రిగ వాసులు

వేతనాలు బ్యాంకుల్లో జమ చేయండి

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో తాత్కాలిక పద్ధతిన పనిచేస్తున్న స్వీపర్లు, ఆయాలకు వేతనాలను బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్.నాగరాజన్ డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని పలుమార్లు మునిసిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట మంగళవారం స్వీపర్లు, ఆయాలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. నాగరాజన్ మాట్లాడుతూ ఏళ్ల తరబడిగా పాఠశాలల్లో పని చేస్తున్న తాత్కాలిక సిబ్బందికి వేతనాలు మంజూరు చేయడంలో అధికారులు పారదర్శకత పాటించడం లేదని చెప్పారు. దీనిపై కమిషనర్ స్పందించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ప్రజారోగ్యశాఖ డా.లోకేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో యూనియన్ నాయకులు గోపినాద్, చంద్ర, రమాదేవి, రమేష్, భువనేశ్వరి, సెల్వి, మేరీ తదితరులు పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడండి

యాదమరి: మండలంలోని గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు గ్రామీణ నీటిపారుదల ఏఈఈ ఉషారాణి ఆదేశించారు. ఆమె మంగళవారం మండలంలోని జంగాలపల్లి పంచాయతీలో పర్యటించారు. ఆమె పంచాయతీలోని ఎస్ఆర్ కండ్రిగ గ్రామంలోని తాగునీటి ట్యాంకులను పరిశీలించారు. మరమ్మతులకు గురైన పైపులైన్లను వెంటనే బాగు చేయాలని చెప్పారు. నీటి ట్యాంకులను పదునైదు రోజులకోసారి శుభ్రపరచాలని తెలిపారు. ప్రతి రోజూ క్లోరినేషన్ చేసిన నీటిని సరఫరా చేయాలన్నారు. ట్యాంకులు పరిసరాల్లో శుభ్రంగా ఉంచాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రోహిత్, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు వేసవి నేపథ్యంలో స్వామి అమ్మవార్ల దర్శనం కోసం క్యూలో ఉండే భక్తులకు మజ్జిగను పంపిణీ చేశారు. ఏఈవో సతీష్ మాలిక్, సూపరింటెండెంట్ సిబ్బంది పాల్గొన్నారు.



గుడిమల్లంలో కోటి

ఏర్పేడు(రేణిగుంట): ఏర్పేడు మండలం గుడిమల్లం పరశురామేశ్వరాలయాన్ని మంగళవారం సాయంత్రం తెలుగు సినీ సంగీత దర్శకులు కోటి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఈవో రామచంద్రారెడ్డి, మాజీ చైర్మన్ బత్తల గిరినాయుడు స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం చేయించారు. తీర్థప్రసాదాలను అందజేశారు.

పొలం పిలుస్తోంది.. లక్ష్యం పారిపోతోంది

రైతులకు సాగుపై అవగాహన కల్పించి సస్యరక్షణలో శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్ది వ్యవసాయం లాభసాటిగా మార్చాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమానికి మొదలుపెట్టింది. ఇందులో వ్యవసాయాధికారులతోపాటు అనుబంధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని రైతులకు వ్యవసాయాభివృద్ధికి అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాల్సి ఉంది.

- వారానికి నాలుగు గ్రామాల్లో నిర్వహించాలి
- రెండు గ్రామాల్లో నిర్వహించి మమ అనిపిస్తున్న వైనం
- కార్యక్రమాలకు ఇతర శాఖల అధికారులు డుమ్మా


పొలం పిలుస్తోంది కార్యక్రమంలో జాడలేని అనుబంధశాఖ అధికారులు.(ఫైల్)

బంగారుపాళెం: గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్రాలను సందర్శించడంతోపాటు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి వారికి అవసరమైన సమాచారాన్ని అందించాలి. విత్తన ఎంపిక మొదలు ఎరువులు, తెలుగు, పురుగుల నివారణ మందులు, సాంకేతిక పరిజ్ఞానం తదితర అన్ని సమస్యలపై నేరుగా చర్చించి అవగాహన కల్పించాలి. అయితే క్షేత్రస్థాయిలో ఇందుకు విరుద్ధంగా సాగుతోంది. వ్యవసాయాధికారులు మినహా మిగిలినవారు పొలంపిలుస్తోంది కార్యక్రమంలో కనిపించడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలో 31 మండలాలు ఉన్నాయి. ప్రతి మండలంలో మంగళ, బుధవారాల్లో రెండు గ్రామాలు చొప్పున వారానికి నాలుగు గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి పొలాలను పరిశీలించి అభ్యుదయ రైతులను ప్రోత్సహించాల్సి ఉంది. కానీ ఆశయానికి అనుగుణంగా ఈ కార్యక్రమం నిర్వహించకపోవడంతో లక్ష్యానికి దూరంగా సాగుతోంది.

కార్యక్రమం నిర్వహణ ఇలా..

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు వ్యవసాయ విస్తరణ లక్ష్యంగా పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో ప్రతి మంగళ, బుధవారాల్లో వ్యవసాయ, అనుబంధశాఖల అధికారులు, శాస్త్రవేత్తలు, ప్రజా ప్రతినిధులు పొలంబాటపట్టి పంటల సాగుపై చర్యలు జరపాలి. రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతిక సమాచార పరిజ్ఞానాన్ని చేరువ చేయాలి. వ్యవసాయ, అనుబంధ శాఖల పథకాలపై అవగాహన కల్పించాలి. క్షేత్ర సమస్యలకు తక్షణమే పరిష్కారం సూచించాలి. తక్కువ పెట్టుబడి, అధిక ఉత్పత్తి, ఎక్కువ నికర ఆదాయం దిశగా ప్రోత్సహించాలి.

ముందస్తు సమాచారం లేక డీలా..

ఏ రోజు ఏ గ్రామంలో కార్యక్రమం జరుగుతుందో అని గ్రామాల్లో ముందస్తు సమాచారం లేకపోవడంతో రైతులు ఎవరి పనుల్లో వారు ఉంటున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు వారి షెడ్యూల్ ప్రకారం గ్రామాలకు వెళ్లి అటుగా వచ్చి వెళ్లే రైతులను కూర్చోబెట్టి కార్యక్రమాన్ని మమ అనిపిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో విత్తు నుంచి ఉత్పత్తి వరకు ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలపై చాలా మందికి అవగాహన భ్రమగానే మారిందని విమర్శలు ఉన్నాయి.

మిగతా అధికారులు ఎక్కడ?

పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులతోపాటు అనుబంధశాఖలైన హార్టికల్చర్, సెరికల్చర్, ఫిషరీష్, వెటర్నరీశాఖ, మార్కెటింగ్ అధికారులు, విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, విద్యుత్, జలవనరుల శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాల్సి ఉంది. వారితో పాటు రైతుమిత్ర సంఘాలు, భూసార పరిరక్షణ అధికారులు హాజరై వ్యవసాయ అభివృద్ధిని అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలి. ప్రభుత్వ పథకాలు, సంక్షేమం, రాయితీలను వివరించి రైతుల్లో చైతన్యం పెంచాలి. 2024–25 ఏడాదికి సంబంధించి సెప్టెంబర్ 24వ తేదీ నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమైంది. మొదటి షెడ్యూల్ పూర్తయి ప్రస్తుతం రెండో విడత షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మిగిలినశాఖ అధికారుల జాడ లేదని రైతులు వాపోతున్నారు.